కథ

# హోరు

సాయంత్రం నాలుగ్గంటలు దాటుతోంది.

రాజభవంతి లాంటి భవంతి లోని ఓ అద్భుతమైన గదిలో డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని తుదిమెరుగులు దిద్దుకుంటోంది రూపాదేవి.

ఆమె కట్టుకున్న పట్టుచీర తాలూకు జరీ అంచు మిలమిలా మెరిసిపోతోంది. చెవులకున్న రవ్వలు తళతళలాడుతున్నాయి. వీటన్నింటికన్నా వెలిగిపోతోందామె ముఖం!

కారణం ఆ రోజు రూపకు సన్మానం.

అలాంటిలాంటి సన్మానం కాదు. ఎన్నో సంస్థలు కలిపి అట్టహాసంగా చేస్తున్న ఘన సన్మానం.

ఆ ఘన సన్మానం గురించి చెప్పే ముందు రూప గురించి కూడా కొంచెం చెప్పుకోవాలి.

రూప అగర్భ శ్రీమంతురాలయిన ఓ గొప్ప సంఘ సేవిక. ఇటీవలే ఓ అనాథాశ్రమం కూడా స్థాపించింది. పేదలపాలిటి పెన్నిధి, ఆకలిగొన్న వారికి అన్నపూర్ణ, అనాథలకి అండ-ఇలాంటి చాలా బిరుదులున్నాయామెకి!

పేదల ఆకలి కథలకి ఆమె హృదయం ద్రవిస్తుంది. కన్నీటి గాథలకు చలించిపోతుంది. స్త్రీల బాధలు చూస్తే ఆమె కళ్ళు వరదలయి ప్రవహిస్తాయి!

రూప చేసే సేవలు గుర్తించిన కొన్ని సంస్థలు, ఆమెకి సన్మానం చెయ్యాలని నిర్ణయించుకుని ఆమెకి చెప్పాయి. అయితే ముందు రూప అంగీకరించలేదు. కానీ నెంబరు వన్ తారగా వెలుగొందే సినీ తార 'లావణ్య' చేతుల మీదుగా ఆ సన్మానం జరిపిస్తారని తెలియగానే ఆనందంగా అంగీకరించింది రూప.

రూపకి సినీతార 'లావణ్య' అంటే చాలా చాలా అభిమానం. అదీగాక లావణ్య హృదయం వెన్న లాంటిదనీ, అనాథ స్త్రీల పట్ల, దిక్కులేని పసివారి పట్ల ఆమెకెంతో ఆదరం వుందనీ, అలాంటి వారి కోసం లావణ్య లక్షలకు లక్షలు విరాళంగా ఇస్తుందని కూడా విన్నది.

లావణ్య కూడా రూపని గురించి చెప్పగానే ఆ సన్మానానికి రావడానికి ఒప్పుకుంది.

ఆ రోజు రూప ఇంట్లోనే ఆమె బస. ఓ గంట క్రితం ఆ పట్టణంలోని మరో ఫంక్షనికి వెళ్ళింది లావణ్య. వెడుతూ అయిదింటికల్లా ఆడిటోరియంకు వచ్చేస్తాననీ, రూపను కూడా వచ్చేయమని చెప్పింది.

రూపకి చాలా ఆనందంగా వుంది. చక్కగా ముస్తాబు చేసుకుని వరండాలోకొచ్చింది. మరో అరగంట తర్వాత ఆమె కారు ఆడిటోరియం కేసి పరుగులు తీసింది. రూప అక్కడికి చేరేసరికి అప్పుడే లావణ్య కారు కూడా వచ్చి ఆగింది. పరిసరాలన్నీ జనంతో కిటకిటలాడిపోయాయి. గేటు దగ్గర కొందరు పెద్దలు, నలుగురు వేద పండితులు నిల్చున్నారు.

కార్లు గేట్లోంచి లోపల కొచ్చాయి.

కెమేరాలు 'క్లిక్' మంటున్నాయి.

వీడియో కేసెట్స్ తిరుగుతున్నాయి.

కార్లు ఆగ్గానే లావణ్య, రూప మెల్లగా దిగారు.

జన ప్రవాహం ఒక్క వుదుటున పొంగింది.

పోలీసులు వాళ్ళని అదుపులో పెట్టలేక నానా అవస్థలు పడుతున్నారు.

పండితులు వేద పఠనం ప్రారంభించారు. పెద్దలు అట్టహాసంగా ఆ ఇద్దరు మహిళా రత్నాలను లోపలకి తీసుకెళ్ళారు.

పరిచయాలూ, పలకరింపులూ పూర్తికాగానే పెద్దలంతా వేదిక నలంకరించారు. వేదిక మీద నున్న పెద్దలందర్నీ సభకు పరిచయం చేశారు మరి కొందరు పెద్దలు!

అందరూ రూప చేసిన, చేస్తున్న సంఘసేవను వేనోళ్ళ కొనియాడారు. రూపకు నిలువెత్తు పూలదండ వేసి, పట్టు శాలువా కప్పింది లావణ్య. జనం కొట్టిన చప్పట్లతో మారుమ్రోగి పోయింది ఆడిటోరియమంతా.

లావణ్య తాను తెచ్చిన గులాబీల దండ వేసి బొట్టు పెట్టి, పట్టుచీర ఇచ్చింది.

మరోసారి చప్పట్లు మారుమ్రోగాయి. ఆ తర్వాత గుట్టలు గుట్టలుగా దండలు పడ్డాయి రూప మెడలో

లావణ్య రూప గురించి చాలా గొప్పగా మట్లాడింది. స్త్రీల పాలిట కల్పతరువుగా అభివర్ణించింది.

"నిజానికి నేనిలాంటి సభలకు అంతగా రాను. కానీ శ్రీమతి రూప చేసిన ప్రజాసేవ, స్త్రీ జనోద్ధరణ గురించి విని ఒప్పుకున్నాను. ఇప్పుడు ఇలాంటి అవకాశం నాకొచ్చినందుకు గర్విస్తున్నాను. శ్రీమతి రూప ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి మరింత మంచి కీర్తి కిరీటాన్ని ధరించాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ ముగించింది లావణ్య

ఇవి ఆమె గుండె లోతుల్లోంచి వచ్చిన మాటలు. అంతేగాని మామూలుగా వేదికల మీద మాట్లాడే ముఖప్రీతి మాటలు మాత్రం కావు!

ఆ తర్వాత రూప పేరు పేరునా అందరికీ కృతజ్ఞతలు చెప్పుకుంది.

కడ ఊపిరి పీల్చేదాకా అనాథ స్త్రీలని ఆదుకుంటూనే వుంటానని కంట తడి తుడుచుకుంటూ వాగ్దానం చేసింది.

సభ ముగిసింది.

రూప, లావణ్య అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయారు.

ఆ రోజు నుంచీ రూప పేరు మారుమ్రోగిపోయింది. ఇప్పుడామె లేని పెద్ద సభ లేదు. ఆమె వెళ్ళని ఫంక్షన్ అరుదు!

* * *

ఆ రోజు ఆదివారం

ఏదో సమాజంవారు రూపని ముఖ్య అతిథిగా పిల్చారు. ఆ రోజు ఆ సమాజానికి వచ్చేవారంతా గొప్ప గొప్పవారు గనుక ఒప్పుకుంది రూప.

ఆ రోజు సాయంత్రం వరకు ఆనాటి సన్మానం తాలూకు కేసెట్ టి.వి.లో చూస్తుండి పోయిన రూప గడియారం అయిదు గంటలు కొట్టేసరికి త్రుళ్ళిపడి ఈ లోకంలోకొచ్చింది. ఫంక్షన్ విషయం గుర్తుకొచ్చే సరికి కంగారు పడిపోయింది టైమయిందని.

పది నిమిషాల్లో రెడీ అయి నీట్‌గా ముస్తాబయింది. అయితే, రూప బయల్దేరే సమయానికి బ్రహ్మాండంగా మబ్బు పట్టి సన్నగా తుంపర మొదలయింది!

అసహనంగా వాచీ చూసుకుంది.

అయిదున్నర దాటింది.

అయిదింటికే ఫంక్షన్.

ఆదుర్దాగా వరండాలోకొచ్చింది.

క్షణాల్లో సన్న తుంపర కుంభవృష్టిగా మారిపోయింది.

అది చూసి నీరసంగా కూర్చుండిపోయింది రూప.

రాను రాను ఈదురు గాలి కూడా మొదలయింది.

ఈ పరిస్థితిలో ఫంక్షన్‌కు వెళ్ళినా సుఖం లేదనుకుంది.

డ్రస్ మార్చుకుని టి.వి. చూస్తుండిపోయింది.


రాత్రి తొమ్మిది గంటలు దాటినా వర్షం తగ్గుముఖం పట్టలేదు. అలా కుండపోతగా కురుస్తూనే వుంది! వీధులన్నీ జలమయం అయిపోయాయి.

వంట మనిషి భోజనానికి పిలవడంతో లేచి టి.వి. ఆఫ్‌చేసి కిటికీ లోంచి బయటకు చూసింది.

అప్పుడే గేటు తీసుకుని వస్తున్నారెవరో. రూప కళ్ళు చిత్రంగా ముడుచుకున్నాయి.

ఆ వస్తున్నది ఓ వృద్ధురాలు.

చిరిగి పీలికలయిన బట్టలతో, అట్టలు కట్టేసుకున్న జుట్టుతో, ముడతలు పడ్డ శరీరంతో, వంగిపోయిన నడుంతో



— నందం రామారావు

అతి ప్రయాసగా నడిచి వస్తోంది ఆ వృద్ధురాలు.

"ఎవరూ?" అంటూ అరిచింది రూప.

ఆమె అరుపుకి నౌకర్లంతా వచ్చారక్కడికి.

ఆ వృద్ధురాలు గజగజ వణకిపోతూ వరండాలోకొచ్చింది.

మరోసారి అరిచింది రూప.

కఠినమైన రూప స్వరానికి ఆ వృద్ధురాలు బిత్తరపోయింది.

"మొన్న రేతిరి నుంచి తిండి నేదమ్మ. అడుక్కుంటుంటే వాన పట్టుకుంది. తల్లి తల్లి ఓ ముద్ద పడెయ్యమ్మా" దీనంగా అందా వృద్ధురాలు.

వానకి తడిసి, మాసి కంపు కొడుతున్నట్టు ఆమె బట్టల్లోంచి నీళ్ళు వరండా వంతా ఆక్రమించుకుంటున్నాయి. బురద కాళ్ళతో వరండాలోకి రావడం వల్ల ఆ వరండా బురదతో పాడయిపోయింది.

రూప ముఖం మరింత కఠినంగా అయిపోయింది. "ఛ! ఛ! డర్టీ రోగ్. ముందవతలికి పో. రంగా! ఒరేయ్ రంగా! చూస్తావేం ఆ ముసల్దాన్ని ముందు బయటకు నెట్టు" అంది.

"ఆకలమ్మా" గొణిగింది వృద్ధురాలు.

"గెటవుట్ అయ్ సే" అరిచింది రూప.

ముసలామె సూటిగా రూప కళ్ళల్లోకి చూసింది.

ఆ చూపుకి మరింత మండిపడింది రూప.

"వెడతావా వెళ్ళవా?" అంది గర్జిస్తున్నట్టు.

"అన్నం పెట్టకపోతే పోనీమ్మా. ఈ వాన తగ్గేదాకాన్న కాత్త వుండనీండి" దీనంగా అంది వృద్ధురాలు.

"నో... నో... అదేం కుదరదు. నీ మురికి బట్టల మూలంగా వరండా అంతా నాశనం అయిపోతోంది. వెళ్ళు. వెళ్ళి మరో చోట తలదాచుకో" నిర్దయగా అంది రూప. అయినా ఆ వృద్ధురాలు కదల్లేదు. ఒణికిపోతూ బతిమిలాడ సాగింది. ఆమె దీన స్థితి చూసిన నౌకర్లు కూడా ఆమెని బయటకు గెంటడానికి సాహసించలేదు. రూపాదేవి ఆగ్రహం అంచులు దాటింది.

"యూ డెవిల్. వెళ్ళమంటుంటే కదలవ్. ఇదేం నీ బాబు గాడి ఇల్లనుకున్నావా?" అంటూ విసురుగా ఒక్క తోపు తోసింది.

ఆ విసురుకు వృద్ధురాలు అంత దూరాన నీళ్ళల్లో పడింది.

అప్పుడే

"ఏంటి మేడం ఈ ఘోరం" అంటూ నలుగురు వ్యక్తులు, ఇద్దరు ఆడవాళ్ళు బిలబిల్లాడుతూ వచ్చి కంగారుగా ఆ వృద్ధురాలిని లేవదీశారు.

రూపాదేవి జరిగిందేమిటో గ్రహించే లోపల వృద్ధురాలు నిల్చుంది. ఆమె తలకున్న 'విగ్' పడిపోయి నల్ల పట్టులాంటి జుట్టు భుజాల మీద పరచుకుంది. ఓ యువతి ఆమె భుజాల నిండా ఓ ఖరీదైన షాల్ కప్పింది కంగారుగా.

ఆ వృద్ధురాలు ఎవరో కాదు!

ప్రఖ్యాత నటి లావణ్య!

లావణ్య చురుకైన కళ్ళు రూపాదేవిని తీక్షణంగా చూశాయి.

"సారీ! రూపాదేవి గారూ, పక్క ఊళ్ళో ఓ పిక్చర్ షూటింగ్ కోసం వచ్చాం. వాన మూలంగా షూటింగ్ ఆగిపోయింది. వెంటనే మీరు గుర్తుకొచ్చారు. మిమ్మల్ని చూడాలనిపించింది. మావాళ్ళకి చెప్పాను. మీ గొప్పదనం గురించి కూడా చెప్పాను. మీ గురించి చెప్పగానే మావాళ్ళు నవ్వారు. నాక్కోపం వచ్చింది. మీరు నిజంగా దీనజనోద్ధరణ కోసమే పుట్టారని నేనూ, అదో వేషమని మావాళ్ళూ వాదులాడుకున్నాం. అది పందెం వరకు వెళ్ళింది. మీరు దీన జనుల్ని ఎలా ఆదుకుంటారో మావాళ్ళందరికీ స్వయంగా చూపించాలనిపించింది. అందుకే, నా పిక్చర్లో వేషమైన ముష్టి వృద్ధురాలి వేషంలోనే వచ్చాను. మీ ఆదరాన్ని చవి చూశాను. నేతి బీరకాయలో నెయ్యెంత వుందో స్వయంగా తెలుసుకున్నాను. నేను మాత్రం చిత్తుగా ఓడిపోయాను. సారీ మీ వరండా అంతా పాడయిపోయినట్టుంది. ఇంకెప్పుడూ ఇలా వచ్చి ఇబ్బంది పెట్టం. బయట మా కార్లు వున్నాయి. వస్తాం. కాదు వెడుతున్నాం. గుడ్‌బై" అంటూ వెనుదిరిగింది లావణ్య.

ఆమె వెనకే ఆమె మనుషులూ నడిచారు. ఆ ఇంటి దగ్గరలోనే ఆగి వున్న కార్లు కదిలిపోయాయి వర్షంలోనే.

రూపాదేవి శిలలా బిగుసుకుపోయింది. గాలివాన హోరుకన్నా ఎక్కువగా వుంది ఆమె మనస్సులోని హోరు!

వర్షం కురుస్తూనే వుంది! ☉

# 'ప్ర'పంచ పదులు



## 63



నిరంతర ప్రవాహమే కెరటానికి జీవగుణం
నిరంతర ప్రసారమే కిరణానికి జీవగుణం.
అంతటితో ఎంత తృప్తి అర్భకమతులకు పాపం—
నిరంతర సమీక్షణమే పరమమౌని జీవగుణం
నిరంతర నిరీక్షణమే స్థిర జ్ఞాని జీవగుణం

## 64

పూల నునుపు తెలుస్తుంది ముళ్ళ మొనలు ముడితేనే
వేకువ వెల తెలుస్తుంది చీకటి తెరపడితేనే
రెండో పార్శ్వం చూడక నిండు నిజం చెబుతావా —
సుఖం విలువ తెలుస్తుంది శోకం పైబడితేనే
జీవి అంతు తెలుస్తుంది చావు లోతు తడితేనే

— డాక్టర్ సి. నారాయణరెడ్డి



# భార్యల సంఘం

చైనాలో భర్తల దుర్వ్యసనాలను మాన్పించడానికి భార్యలు చక్కని ఉపాయాన్ని ఆలోచించారు.

అక్కడ భర్తలకు భార్యలే ఈ విషయంలో యముళ్ళలా తయారయ్యారు.

చైనాలోని దాదాపు నాలుగు లక్షల మంది మహిళలు తమ భర్త దుర్వ్యసనాలను మాన్పించడానికి వివిధ సంఘాలుగా ఏర్పడ్డారు. తమకు చాతనైతే ఈ సంఘం ద్వారా భర్తల్లో మార్పు తీసుకువస్తారు. కుదరకపోతే పోలీసుల సహాయాన్ని తీసుకుంటారు. దీనివల్ల దాదాపు 50 వేల మంది భర్తల్లో మార్పు వచ్చిందట. భార్యా సంఘాల భయం వల్ల వాళ్ళు జూదం కంటే పిల్లలపైనే అధిక శ్రద్ధ కనబరుస్తున్నారట.

—జి. ఆర్.




"త్రినేత్రుడు" సూర్యదేవర
ఇప్పుడు ఒకే ఒక
సీరియల్ రాస్తున్నారు!
అదీ ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక పాఠకుల కోసమే!